నీడగా వుంటుంది. బాదంచెట్ల మ్రానులనిండా నల్లని పెద్ద చీమలు ఏకాలమూ పాకుతూవుంటాయి! వానవచ్చి వెలిసినాక పొన్నపూలు అన్నీ తడిసి రెక్కలూడిపోయి క్రిందికి రాలిపోతాయి!

రాచ వుసిరి చెట్లమీద చేరిన కాకులూ, పిచ్చికలూ, ఒకటే రణగొణ ధ్వనిచేస్తూ, పసిరికాయలన్నీ తెంపి క్రింద పోస్తూ ఉంటాయి. పెరడు అంతా ఎండిపోయి రాలిపోయిన బాదం, పొన్న ఆకులతో నిండిపోయి, గత్తరగా వుంటుంది. సాయంకాలాలు క్రింది వాటాలలోని పిల్లలూ, వాళ్ళ స్నేహితులయిన ఇరుగు పొరుగు ఇళ్ళల్లోని పిల్లలూ చేరి గోలగోలగా అరుస్తూ, ఆటలు ఆడుకుంటూ వుంటారు. అప్పుడప్పుడు క్రింది వాటాల్లోని ఇల్లాళ్ళు ఆ చెత్త ఆకుల్ని ఊడ్చి కుప్పపెట్టి అంటించి, దానిమీద ఒక కుండెడు నీళ్ళు కాచుకొంటూ వుంటారు. గాలి వేసినప్పుడు ఆ బూడిదంతా ఎగిరి పెరడంతా పరుచుకుంటూ వుంటుంది. క్రితం రాత్రి చివరి ఝామునలో వర్షం కురిసినట్లుంది. ఆకాశం అంతా శుభ్రస్నాతలా, నీలంగా నిగనిగలాడుతోంది! చెట్ల ఆకులన్నీ ముదురాకు పచ్చగా, చేయితిరిగిన చిత్రకారుడు రచించిన తడియారని వర్ణ ప్రకృతి చిత్రంలోలా పచ్చగా కళ్ళకి చల్లగా కన్పించుతోన్నాయి!

ఆ సుప్రభాత సమయాన్ని ఆ పెరటిలో ఒకమూలగా కుళాయి వద్ద ఇత్తడిబాల్చీతో నీళ్ళు పట్టుకుంటోన్న - పది ఏళ్ళపైగా వుండవచ్చు అనుకునే పిల్లమీద నాదృష్టిపడింది! ఆ పిల్ల గోధుమ రంగుగా వున్న చిన్నలాగూ వేసుకుంది.

"వాళ్ళూ పసివాళ్ళుకదా ! వాళ్ళని కూడా పిల్చి పెట్టు !" అనేదాన్ని.

"వాళ్ళకేం మాయరోగమా ! పీకనిండా అన్నం తిన్నారా ? వాళ్ళమ్మ వాళ్ళ ఫలహారాలకోసమని అర్ధ రూపాయి ఇచ్చివెళ్తుంది రోజూనూ ! నేను కొనిపెడు తున్నాగా !" అనేది. నా అంతట నేను ఏదో ఒకటి చేసి పెడుతూనే వుండేదాన్ని ! అదికాక రోజూ ఏదో వకటి అప్పు పట్టుకెళ్తూ వుండేది. ఒక పావు మైదా అనీ, ఇంకో పావు శెనగపిండి అనీ, ఒక గిన్నెడు డాల్డాఅనీ, ఇల్లా రోజూ ఏదో ఒకటి ఇందిరమ్మ ఇమ్మన్నదని అడిగి పట్టుకువెళ్తూ వుండేది ! కొన్నికొన్ని సామాన్లు తిరిగి ఇచ్చేది. కొన్ని సామాన్లు తిరిగి ఇచ్చేదికాదు !

'మోతీ' వాళ్ళు ఆ ఇంటికి వచ్చేక, మేము ఆ వూళ్లో ఆరునెలలు మాత్రమే వున్నాము. మా వారికి ట్రాన్స్ఫర్ అవటంనించి మేము ఇంకో వూరు వెళ్ళిపోయాము. మేము వెళ్ళిపోతూంటే 'మోతీ' దిగాలుగా నించుంది. నేను ఐదు రూపాయలు ఆ పిల్లచేతిలో పెట్టాను !

రెండేళ్ళు గడిచాక మా బంధువుల ఇంట్లో పెళ్ళి అయితే, ఆ వూరు వెళ్ళటం తటస్థించింది. అప్పుడు మేము ఉండే ఆ మేడకి కూడా వెళ్ళేను. మా ఇంటావిడ నన్ను చాలా మర్యాద చేసింది. ఆమెని 'మోతీ' గురించి అడిగాను. ఇందిరమ్మ వుద్యోగం మానేసిందట ! రాజారావుకి మంచి ప్రమోషన్ వచ్చిందట ! రెండునెలలు క్రితమే ఇంకోఊరు ట్రాన్స్ఫర్ అయి వెళ్ళారుట ! ఇంటావిడ చెప్పారు.

వాళ్ళకి కడుపులు నిండటానికే అక్కడ రూపాయలు మూటలు కట్టుకుని కూర్చోలేదుకదా ! మా అక్కలు ఎవరిళ్ళల్లోనో పనికి కుదురుకునివుంటారు. ఇక్కడ నేనేదో చదువులు చదువుకుని ఉద్యోగస్థురాలి నవుతానని, వాళ్ళు ఊహించుకుంటారు. నా కిక్కడకు వచ్చినందువల్ల వంటబట్టిన విద్య అంట్లు తోమటం, బట్టలుతకటం అలవాటు అయిన సంస్కారం, ఏదో ఒక విధంగా కడుపు నింపుకోవటం. ఈ నిజజీవితం వాళ్ళకి తెలియపరచి, నేనన్నా సుఖపడుతున్నానన్న వాళ్ళ భ్రమని ఎందుకు మట్టిచేయాలి ?" అంది మోతీ.

నిజంగానే మోతీ చాలా ఎదిగిపోయిందనిపించింది నాకు ! వాస్తవిక జీవనానికి ప్రతీక మోతీ.

"అయితే మరి ఎక్కడుంటున్నావ్ !" అన్నాను.

నల్లగా పొడుగ్గావున్న మనిషి ఒకడువచ్చి, అరటిపళ్లు, చామంతిపూలూ ఉన్న ప్లాస్టిక్ వైర్ సంచీ ఒకటి మోతీ చేతికిచ్చి-

"ఇంకా బస్సువచ్చేది కావడంలేదా !" అంటూ నించున్న చోటనే తుపుక్కుమని నములుతూన్న కారాకిళ్ళీని ఉమ్మేశాడు. దుబ్బులాంటి క్రాఫింగ్, నల్ళ కళ్ళద్దాలు, చారల పైజామాలోనుంచి అల్లిక బనీను, కన్పడుతోన్న పల్చని, తెల్లని వాయిల్ లాల్చీ. అతని వేషం అంతా నాకు అదోలా అన్పించింది.

"ఇతనితో ఈ ఊరు వచ్చేసాను. సినిమాహాల్లో గేటు కీపర్ గా పనిచేస్తున్నాడు. ముప్ఫయ్ రూపాయలిస్తారు. నేనూ హోటలు అజంతాలో పప్పు రుబ్బటానికి కుదిరాను.

